క్లుప్తంగా

పంట నమోదులో నిర్లక్ష్యం తగదు



ఈ-క్రాప్ నమోదైన పంటలను పరిశీలిస్తున్న డీఏఓ పి.వరలక్ష్మి

కృష్ణగిరి: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి పి.వరలక్ష్మి హెచ్చరించారు. మండల పరిధిలోని కటారుకొండ, అమకతాడు, ఆలంకొండ, లక్కసాగరం గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు చేసిన పొలాలను ఆమె మంగళవారం సూపర్ చెక్ చేశారు. ఈ యేడాది జియో ఫెన్సింగ్ యాప్‌లో పంట నమోదు చేయాల్సి ఉందని, ఈ నెల చివరికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో ఇప్పటివరకు 36 వేల ఎకరాల్లో పంట నమోదు అయ్యిందని మిగతాది త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ రాజేష్ తదితరులు ఉన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ సురేష్‌బాబు

దేవనకొండ: మండలంలో ఇప్పటివరకు 19 వేల మంది రైతులు పంటల నమోదు చేయించుకున్నారని, 9 వేల మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకున్నట్లు మండల వ్యవసాయాధికారి(ఏఓ) సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు రైతులకు ఈ-కేవైసీ చేయించుకునేందుకు అవకాశం ఉందన్నారు. రైతులు త్వరితగతిన ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీ పథకాలు పంటల ఇన్సూరెన్స్ రాదని చెప్పారు.

ముళ్లకంపల తొలగింపు



జేసీబీతో ముళ్లకంపలను తొలగిస్తున్న జెడ్పీటీసీ లింగప్ప

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి రోడ్డు నుంచి ఆలూరు రోడ్డు, హొళగుంద రోడ్డు వరకు నాలుగు కి.మీ మేర రోడ్డుకు అడ్డంగా పెరిగిన ముళ్ల కంపల తొలగింపు పనులను జెడ్పీటీసీ లింగప్ప మంగళవారం చేపట్టారు. జేసీబీ ద్వారా ముళ్ల కంపలను తొలగించారు. గతంలో ఈ మార్గాల్లో ప్రయాణాలు చేసేటప్పుడు ప్రయాణికులు ఇబ్బందులు పడేవారన్నారు. మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో ముళ్ల కంపల తొలగింపు పనులు చేపట్టినట్లు జెడ్పీటీసీ తెలిపారు. సర్పంచ్ గాదిలింగప్ప, నాయకులు లక్ష్మన్న, గోవిందప్ప, మాలింగ, ప్రభుస్వామి, రామయ్య, వెంకటేష్, హనుమంతు, గాదిలింగ తదితరులు పనులను పర్యవేక్షించారు.

మడ్డిలింగదహళ్లిలో రక్తదాన శిబిరం



మడ్డిలింగదహళ్లిలో రక్తదానం చేస్తున్న సర్పంచ్ సుధాకర్

హొళగుంద: మడ్డిలింగదహళ్లి (ఎండీ హళ్లి) గ్రామంలో సోమవారం సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో ఆదోని గోపి చారిటబుల్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ వివిధ రోగాలతో బాధపడుతున్న వారితో పాటు యాక్సిడెంట్లు ఇతర కారణాలతో రక్తం అవసరమైన వారికి రక్తదానం చేసి ప్రాణాలు నిలపాలని కోరారు.

ఇంటింటికీ వైద్య సేవలు

తుగ్గలి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. మంగళవారం రాతనలో సచివాలయ, వైద్య సిబ్బందితో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలు ఆవిష్కరించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తారన్నారు. ఈనెల 30 నుంచి గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సీఎంకు ఘన స్వాగతం

హంద్రీ - నీవా ద్వారా 77 చెరువులకు నీటిని అందించే పథకాన్ని ప్రారంభించేందుకు మంగళవారం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఉదయం ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎంకు మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.









సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు తరలివచ్చిన జనం

పులకించిన కరువు నేల

- సాగునీటితో బీడు భూములకు జలకళ
- జగనన్న రాకతో జనసంద్రమైన లక్కసాగరం
- హంద్రీనీవా జలాలతో కర్నూలు, నంద్యాల జిల్లాలకు పూర్వ వైభవం
- 77 చెరువులకు నీరు మళ్లించే పథకాన్ని స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి
- రైతుల ముఖాల్లో ఆనందోత్సవాలు

కృష్ణగిరి: నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతూ.. అభివృద్ధికి నోచుకోని పశ్చిమ ప్రాంతంపై సీఎం జగనన్న ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి బాటలు వేశారు. చెరువులకు నీరు మళ్లించే పథకంతో ఈ ప్రాంత దుర్భిక్ష పరిస్థితుల్ని పారదోలేందుకు నడుంకట్టి ఈ పథకాన్ని పూర్తి చేసి ప్రారంభించేందుకు మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణగిరి మండలానికి రావడంతో ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఉదయం 10:45కు హెలిప్యాడ్‌కు చెరుకున్న సీఎం జగనన్నకు ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కలెక్టర్ సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, ఎస్పీ కృష్ణకాంత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, గుమ్మనూరు సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, పత్తికొండ మాజీ సర్పంచ్ నాగరత్నమ్మ, రామచంద్రారెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం 77 చెరువులకు నీరు మళ్లించే పంప్‌హౌస్‌కు చేరుకుని శిలాఫలకాన్ని ఆవిష్కరించి స్విచ్ ఆన్ చేసి పథకాన్ని ప్రారంభించారు. ఎంతో ఆశతో నాలుగు నియోజకవర్గాల రైతులు ఎదురుచూస్తున్న ఈ పథకం జగనన్న పూర్తి చేసి ఆయన చేతుల మీదుగా ప్రారంభించేందుకు రావడంతో ఇక్కడి ప్రజలు పులకించిపోయారు. హెలిప్యాడ్, దారి వెంట, పంప్‌హౌస్ వద్ద సీఎం జగనన్నను చూసి ప్రజలు కేరింతలు కొట్టారు. మాట తప్పని మడమ తిప్పని నాయకుడివి నువ్వే జగనన్నా అంటూ నినాదాలు చేశారు. నిత్యం కరువు కాటకాలతో అల్లాడిపోతున్న ఈ ప్రాంత ప్రజల కష్టాలను చూసి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృష్ణా జలాలను హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా నీరు తీసుకరాగా, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నీటిని నాలుగు నియోజకవర్గాల్లోని 77 చెరువులకు నీరు మళ్లించే పథకం పూర్తి చేసి ప్రారంభించడంతో ఇక మా ప్రాంతం కూడా కోనసీమను తలపించేలా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

భారీగా తరలివచ్చిన ప్రజలు

సీఎం జగనన్నను చూసేందుకు పత్తికొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జననేతను చూసేందుకు పోటీ పడ్డారు. భారీ బందోబస్తు మధ్య సీఎం జగనన్న పర్యటన ప్రశాంతంగా ముగిసింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, మాధవరావు, లక్ష్మికాంతరెడ్డి, వెంకటేష్, ప్రహ్లాద, నవీనపాటి, జయరామిరెడ్డి, బీమిరెడ్డి, నాగరాజు, శంకరయ్య, గోవిందురాజులు, శేఖర్‌రెడ్డి, బాలమిన్నెల్ల, గిడ్డయ్య, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీదేవి తదితరులు

మంచిని జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం

తుగ్గలి: ప్రజలకు మంచి చేస్తుంటే ఎల్లో మీడియా జీర్ణించుకోలేక పోతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్, బొందిమడుగుల సచివాయల కన్వీనర్ ఈశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. కోట్లాది రూపాయాల నిధులు ఖర్చు చేసి రాష్ట్ర ప్రభుత్వం చెరువులకు నీరు మళ్లించే మంచి కార్యక్రమం చేపడుతుంటే ఎల్లో మీడియా చిన్న కారణాలు ఎత్తిచూపుతూ అసత్య కథనాలు ప్రచురించడం సరికాదన్నారు. గత టీడీపీ ప్రభుత్వం చెరువులకు నీళ్లివ్వకుండా కాలయాపన చేసి రైతులను, ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. పత్తికొండ చెరువుకు నీళ్లిస్తామని టీడీపీ చేసిన ఆర్భాటాన్ని ఎల్లో మీడియా ఎందుకు ప్రసారం చేయదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం వల్లే బొందిమడుగుల చెరువుకు నీరు వచ్చాయని త్వరలో మండలంలోని అన్ని చెరువులకు నీరు మళ్లించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు.

అన్నదాన కార్యక్రమానికి విరాళం

చిప్పగిరి: మండలంలోని బెల్డోణ గ్రామంలో వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ మంగళవారం రూ.10 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా వినాయక కమిటీ సభ్యులకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

చిప్పగిరి: ఈ నెల 21న స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహించే నిర్వహించే క్యాన్సర్ నిర్ధారణ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ జమీల్ అహమ్మద్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ.. కర్నూల్ విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందని స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఆలూరు రూరల్: మండలంలోని అన్ని సచివాలయాల్లో బుధవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించే ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అల్లబకాష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పత్రిక ప్రకటనలో వెల్లడించారు. బుధ, గురువారం ఆలూరు సచివాలయం-1, మొలగవల్లి సచివాలయం-1, హులేబీడు, అరికెర గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపు ఉంటుందన్నారు. 22, 23 తేదీల్లో కమ్మరచేడు, కురుకుంద గ్రామ సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పేరు, చిరునామా మార్పులు, కొత్త ఆధార్ నమోదు కొరకు వివరాలను దరఖాస్తు ఫారంలో నింపి తహసీల్దార్ లేదా ఎంపీడీఓ సంతకం చేయించి ఆధార్ సెంటర్‌లో సమర్పించి ఎన్‌రోల్ చేయించుకోవాలని సూచించారు.

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా అందిస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దశరథ రామయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీన హాలహర్వి గ్రామ సచివాలయం-1, పెద్దకొత్తిలి, ముగతి-1,21వ తేదీన హాలహర్వి-2, నదికైరవాడి, ముగతి, 22న మాచాపురం, కనకవీడు-1, ముగతి -2, 23న ఇబ్రహీంపురం, కనకవీడు-2, ముగతి-2 గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొలం రస్తా వివాదంపై విచారణ

హొళగుంద: వందవాగిలిలో గత కొద్ది రోజులుగా నెలకొన్న పొలం రస్తా వివాదానికి సంబంధించి మంగళవారం హొళగుంద తహసీల్దారు హుసేన్‌సాహెబ్, సర్వేయర్ శ్రీనివాసులు పరిశీలించారు. దాదాపు 200 ఎకరాలకు తిరిగేందుకు పూర్వం నుంచి రస్తా ఉండేదని అయితే ఓ రైతు రస్తా వదలనని అడ్డగిస్తున్నట్లు గ్రామ రైతులు తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సర్ది చెప్పినా రైతు స్పందించకపోవడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎల్లెల్సీ కాలువలో వినాయక నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పట్టణ సీఐ మధుసూదన్‌రావు, ఎల్లెల్సీ డీఈ లక్ష్మణ్‌కుమార్ పరిశీలించారు. దిగువ కాలువ వద్ద బారికేడ్లు, క్రేన్ల ఏర్పాట్ల గురించి చర్చించారు. వినాయకుడి నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసు బందోబస్తుతో పాటు లైట్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ శరత్, పట్టణ వినాయక కేంద్ర మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లెల్సీ కాలువాలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్, పట్టణ సీఐ తదితరులు

అల్లర్లకు పాల్పడితే చర్యలు

గోనెగండ్ల: వినాయక నిమజ్జన సమయంలో ఎవరైన అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ.. బుధవారం జరిగే వినాయక నిమజ్జనం వేడుకలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. గంజిహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాలు ఎల్లెల్సీ కాలువ, హెచ్.కైరవాడి, పిల్లిగుండ్ల, ఒంటిడుదిన్నె, నెరుడుప్పల తదితర గ్రామాల ప్రజలు వినాయక ప్రతిమలను గాజులదిన్నె ప్రాజెక్టులో నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో ప్రాజెక్టు వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జనం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల్లోపు పూర్తి చేసుకోవాలని మండపాల నిర్వాహకులకు సూచించారు. అలాగే వినాయక శోభాయాత్రలో మద్యం సేవించి అల్లర్లు చేయరాదన్నారు. ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీబీ డ్యాంకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో మంగళవారం ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. సోమవారం 1,700 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయం 2,109 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాం ఎగువన ఉన్న తుంగా ప్రాజెక్ట్ నుంచి 5,459 క్యూసెక్కులు దిగువకు వదులుతుండడంతో ఇన్‌ఫ్లో ఇంకా పెరిగే సూచనలు కనబడుతున్నాయి. డ్యాంలో ప్రస్తుతం 63.428 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జలాశయం నుంచి 9,995 క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు వదులుతున్నారు. దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆంధ్రాలోని 250 కి.మీ వద్ద 483 క్యూసెక్కుల ప్రవాహం ఉంది.

ఈ-క్రాప్ నమోదు పంటల పరిశీలన

హొళగుంద: మండలంలోని చిన్నహ్యాట, ఎల్లార్తి, నెరణికి ఆర్బీకేల పరిధిలో ఇప్పటికే వీఏఏలు ఈక్రాప్ నమోదు చేసిన పంటలను మంగళవారం ఏఓ ఆనంద్ లోకదశ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు వల్ల పంట బీమా, నష్ట పరిహారం, బ్యాంకు రుణాలు తదితర సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఇంకా ఈ-క్రాప్, ఈకేవైసీ చెయించుకోని రైతులు వీఏఏలను కలిసి నమోదు చేయించుకోవాలని ఏఓ సూచించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఏఓతో పాటు వీఏఏలు తస్లీమా, కృష్ణవేణి, రాజునాయక్ ఉన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

హొళగుంద: ముద్దటమాగి గ్రామానికి చెందిన కురువ శకుంతల అనే నిండు గర్భిణీకి మంగళవారం 108లో సుఖ ప్రసవం జరిగింది. మంగళవారం తెల్లవారుజామున శకుంతలకు పురిటి నొప్పులు రావడంతో ఆశ కార్యకర్త యమున 108కు ఫోన్ చేసి సమాచారం అందించింది. హొళగుంద పీహెచ్‌సీకి చెందిన అంబులెన్స్ సిబ్బంది గ్రామానికి వెళ్లి శకుంతలను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మూసా క్యాంప్ వద్ద నొప్పులు తీవ్రమయ్యాయి. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎమ్టీ) కె.యల్లయ్య, పైలెట్ ఆసీఫ్ అలీ సహకారంతో శకుంతలకు సుఖ ప్రసవం జరిగేలే చికిత్స అందించారు. శకుంతల మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉండడంతో వారిని హొళగుంద పీహెచ్‌సీలో అడ్మిట్ చేశారు. శకుంతలకు ఇది మూడవ కాన్పు కాగా సకాలంలో చికిత్స అందించిన అంబులెన్స్ సిబ్బందికి ఆ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



శిశువును చూపుతున్న అంబులెన్స్ సిబ్బంది

చంద్రబాబుకు జైలు శిక్ష తప్పదు

ఆలూరు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న మాజీ సీఎం చంద్రబాబునాయుడుకు జైలు శిక్ష తప్పదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం స్పష్టం చేశారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన ఆయన చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి 9 గంటలకు మంత్రి గుమ్మనూరు జయరాం సమక్షంలో హాలహర్వి మండలం బిలేహాళ్ గ్రామానికి చెందిన బసవరాజ్‌గౌడు, రామిరెడ్డి, గొల్ల భీమలింగ, బోయ పరుశురాముడు ఉచ్చీరప్ప, రామన్న మరో 50 కుటుంబాలకు చెందిన వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి మంత్రి జయరాం పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలన, అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి కార్యకర్తలు స్వయంగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. కార్యకర్తలు గ్రామ, మండల స్థాయి నాయకత్వాన్ని అనుసరిస్తూ ముందుకు సాగాలన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు చేసిన పాపాలన్నీ పండాయని ఇక ఆయన శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. ప్రజలు టీడీపీని ఎప్పుడో తిరస్కరించారని, ఇప్పుడు సానుభూతి డ్రామాలు ఏమాత్రం పనిచేయవని చెప్పారు. టీడీపీకి వత్తాసు పలుకుతున్న దత్త పుత్రుడు పవన్‌కల్యాణ్ ఊహాగానాల్లో ప్రణమిల్లుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకే పట్ట కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు, భీమప్పచౌదరి, లింగప్ప తదితరులు ఉన్నారు.



మంత్రి గుమ్మనూరు జయరాం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బిలేహాళ్ టీడీపీ కార్యకర్తలు

సాగునీరు అందించండి

దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామ సమీపంలో హంద్రీ-నీవా కాలువ వద్ద స్లూయిజ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు వీరశేఖర్, మహేంద్ర, రాము, నారాయణస్వామి, షాకీర్, రైతులు మంత్రి జయరాంకు వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ రైతుల సమస్యలు పరిష్కరించి సాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు.


వృద్ధుడి ఆత్మహత్య

తుగ్గలి: ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని అమినాబాద్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ రాముడు (75) గత కొంత కాలంగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో ఈనెల 17వ తేదీ రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు.



పత్తికొండ ఊరివాకిలి వద్ద వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

విద్యుత్ తీగలు తగిలి 4 ఆవులు మృతి



ఘటనా స్థలంలో ఆవుల కళేబరాలు

వెల్దుర్తి: మండల పరిధిలోని బ్రహ్మగుండం ఎర్రచెరువు గుంతల వద్ద శనివారం విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై 4 పాడి ఆవులు మృతి చెందాయి. రత్నపల్లెకు చెందిన చాకలి రామకృష్ణ తన ఆవులతోపాటు, అన్నదమ్ములు, గ్రామస్తులకు చెందిన ఆవులను మేపుకుంటూ బ్రహ్మగుండం వైపు వచ్చాడు. ఎర్రచెరువు గుంతల వద్ద మేత మేస్తున్న ఆవుల మంద నుంచి నాలుగు ఆవులు పూర్తిగా కిందకు ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ వైర్లను దాటుకుని వచ్చే ప్రయత్నంలో వాటికి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాయి. అన్నదమ్ములైన చాకలి రామకృష్ణకు చెందిన పాలిచ్చే 2 ఆవులు, చాకలి సుధాకర్, చాకలి ఎల్లస్వామిలకు చెందిన ఒక్కొక్క ఆవు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. అప్రమత్తమైన చాకలి రామకృష్ణ, వాహనదారుల ద్వారా సమాచారం అందుకున్న లైన్‌మెన్ మద్దయ్య విద్యుత్ సరఫరా నిలిపివేసి చేసి ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. పశు వైద్యాధికారి డాక్టర్ శాంతలత ఆవుల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించారు. మృతి చెందిన ఆవుల విలువ రూ.2లక్షలు ఉంటుందని, ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న వైర్లు, లైను మార్చి తగు చర్యలు తీసుకోనున్నట్లు విద్యుత్ ఏఈ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు.

విఘ్నేశ్వరా నమోస్తుతే

సకాలంలో వర్షాలు కురిపించి పంటలు బాగా పండేలా చూడాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని, భక్తులు ఓ బొజ్జగణపయ్యా మమ్మల్ని సల్లంగా చూడాలయ్యా అంటూ వినాయక చవితి సందర్భంగా సోమవారం భక్తులు స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీధివీధినా వినాయక ప్రతిమలను కొలువుంచారు. కులమతాలకు అతీతంగా ప్రజలు తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. స్వామి వారికి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి ఇచ్చి తర్వాత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



కొండవీటి ప్రాంతంలో కొలువుదీరిన గణనాథుడు



ఎమ్మిగనూరులో గణనాథుడి పూజలో పాల్గొన్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి



దేవనకొండ వడ్డెగేరి గణేష్ విగ్రహం వద్ద గుమ్మనూరు ఈశ్వర్, భక్తులు



సోమప్ప నగర్‌లో యాలుకుల గణనాథుడు



ఆలూరులోని కోయనగర్‌లో కొలువైన గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు